జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

శనివారం 10-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :224 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

# జల వివాదాలు

## మనమే పరిష్కరించుకుందాం



### చంద్రబాబుకు రేవంత్ విజ్ఞప్తి



- రాజకీయాలకు అతీతంగా: నీళ్ల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.
- కోర్టుల కంటే చర్చలే ముఖ్యం: సమస్యలను కోర్టుల ద్వారా కాకుండా, సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.
- నీళ్లే ప్రాధాన్యత: "తెలంగాణకు పంచాయితీలు (వివాదాలు) వద్దు.. నీళ్లే కావాలి" అని తన ప్రాధాన్యతను చాటారు.

## కర్నూలు బస్సు ప్రమాదం తరహాలో.. రాయచోటిలో మరో దుర్ఘటన



రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని గాలివీడు రింగ్‌రోడ్డు కూడలిలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదనపల్లి నుంచి కడపవైపు వెళుతున్న కంటైనర్ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగంలో ద్విచక్ర వాహనం ఇరుక్కు పోయి.. 20 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంక్ పగిలి కంటైనర్ వాహనానికి మంటలు అంటుకున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళుతున్న శ్రీనివాసులు (48) అక్కడికక్కడే మృతి చెందారు.

పేజీ 2లో

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.14 కోట్ల విలువైన గంజాయి పట్టివేత



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. ఖతార్ నుంచి వచ్చిన విమానంలో 14 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ రూ.14కోట్లు ఉంటుందని అంచనా. గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఏరివేస్తా:

### పవన్‌కల్యాణ్



2లో

- ఏరివేస్తా: పిఠాపురంలో కావాలని గొడవలు సృష్టించి, అశాంతిని రేపాలని చూసే వారిని ఇక్కడే ఉండి ఏరివేస్తానని పవన్ కల్యాణ్ హెచ్చరించారు.
- శాంతిభద్రతలు: తనను లేదా పార్టీని తిట్టినా భరిస్తానని, కానీ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది:




2లో

- కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

## డాక్టర్ సుధాకర్ కుమారుడికి ఉద్యోగం..

### కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం: అనిత



- గతంలో సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ కుమారుడు లలిత్ ప్రసాద్ కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ఆయనను గ్రూప్-2 కేడర్ కింద రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

## ఐదో రోజూ నష్టాలే..

### 25,700 దిగువకు నిఫ్టీ



## 7.83 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం..



### 44లక్షల లడ్డూల విక్రయం: తితిదే ఛైర్మన్

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం చేశామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. వైకుంఠద్వార దర్శనాలు విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా తిరుమలలో అత్యంత వైభవంగా వైకుంఠద్వార దర్శనాలు నిర్వహించినట్లు చెప్పారు. రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా తితిదే కల్పించిన ఏర్పాట్లపై 93 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడించారు. ఈ మేరకు తిరుమలలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు, తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు.

## నేనున్నా.. కష్టపడి బాగా చదువుకోండి..



నవీన్, అజయ్‌లకు చెక్కు అందజేస్తున్న కేసీఆర్

'ఎలాంటి ఆపద వచ్చినా అండగా నేనుంటా. కష్టపడి బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలి బిడ్డా..' అంటూ మాజీ సీఎం కేసీఆర్ నిరుపేద విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్తు ప్రమాదంలో సత్తయ్య అనే రైతు మృతి చెందారు. ఆయన కుమారుడు నవీన్ బీటెక్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేసే పరిస్థితి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన మరో నిరుపేద రైతు పెద్దోళ్ల సాయిలు కొన్నేళ్ల కిందట మృతి చెందారు. ఆయన కుమారుడు అజయ్ ఇంజినీరింగ్ విద్యార్థి.

# సంపాదకీయం

## దేశానికి అవసరమైన మందు సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

కొత్త సంవత్సరం రాకతో మనలో కొత్త ఆశలు మోసులెత్తుతాయి. మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగుతాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఎంతో ఆశావహంగా గడుపుదామనుకుంటాంగానీ మన చుట్టూ నిరాశాజనకమైన వాతావరణం అలముకుని ఉంది. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు, వాణిజ్య యుద్ధాలు, పొంచి ఉన్న అంటువ్యాధులు, తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షోభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.

ఆయురారోగ్యాలతో వర్థిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏ మేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది.

కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8 గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44 ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం. మన దేశంలోనూ అలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు.

ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారు లక్ష డెబ్భై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి.

ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యాౌప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుధృడమైన కృషి చేపట్టాలి.

ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి.

కఠోర వాస్తవాలు

క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడినౌఆర్థికంగా అందరికీ మెరుగైనౌఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మౌలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు.

అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం.

మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటున్నది.

గత డిసెంబర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి 2000 మంది జనాభాకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' నెలకొల్పుతామంటూ చేసిన ప్రకటన మూలంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం అవుతాయనే ఆశ చిగురించే అవకాశముంది. వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఈ ఆరోగ్య మందిరాలను నెలకొల్పారుగానీ సెకండరీ/ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలతో వీటిని పూర్తి స్థాయిలో అనుసంధానం చెయ్యలేదు. అలాగే 'రిఫరల్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నది. ఇక ప్రభుత్వ ప్రాయోజిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ప్రధానమంత్రి జన ఆయుష్ యోజన' (పిఎం.జె.ఎ.వై) ఆసుపత్రిలో 'ఇన్-పేషెంట్' ఖర్చులకు పూచీ పడుతుంది కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల ఖర్చులను

## 7.83లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం.. 44లక్షల లడ్డూల విక్రయం: తితిదే ఛైర్మన్

మొదటి పేజీ తరువాయి

"2023లో 6.47 లక్షల మంది, 2024లో 6.83 లక్షల మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి లక్ష మంది భక్తులు అధికంగా దర్శనం చేసుకున్నారు. 10 రోజుల్లో రూ.41 కోట్లు హుండీ ఆదాయం సమకూరింది. 44 లక్షల లడ్డూలు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయించాం. గతేడాది కంటే 27 శాతం అదనంగా భక్తులకు అన్నప్రసాదాలు అందించగలిగాం. 50టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణలు అద్భుతంగా చేశాం. కల్యాణకట్ట సేవలు, పారిశుద్ధ్యం, వైద్య సేవల ఏర్పాట్లు భక్తులకు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రణాళిక ప్రకారం క్యూలైన్ల వద్ద మార్పులు చేయడం ద్వారా అంచనా కంటే అధిక సంఖ్యలో భక్తుల వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకున్నారు" అని బీఆర్ నాయుడు తెలిపారు.

శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్‌కు విశేష స్పందన..

శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్‌కు భక్తుల నుంచి విశేష ఆదరణ వస్తోందని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలో ఆఫ్‌లైన్‌లో జారీ చేసే 800 శ్రీవాణి దర్శన టికెట్లను ఇవాళ్టి నుంచి ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్ విధానంలో జారీ చేయాలని తితిదే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో శ్రీవాణి దర్శన కోటా టికెట్లను తితిదే విడుదల చేసింది. కోటా విడుదల చేసిన 7 నిమిషాల్లోనే 800 టిక్కెట్లు బుకింగ్ చేసుకున్నారు. టికెట్లు పొందిన భక్తులకు ఇవాళ సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. తిరుపతి ఎయిర్‌పోర్టులో యథవిధిగా ఆఫ్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానం (రోజుకు 200 శ్రీవాణి టికెట్లు) కొనసాగుతుందని తితిదే తెలిపింది.

## డాక్టర్ సుధాకర్ కుమారుడికి ఉద్యోగం..

మొదటి పేజీ తరువాయి

అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో వేధింపులతో మృతిచెందిన డాక్టర్ సుధాకర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధాకర్ కుమారుడు లలిత్‌ప్రసాద్‌కు ఉద్యోగ హోదా పెంచి గ్రూప్-2 సేవల కింద రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దారుగా నియమించింది. ఈ నేపథ్యంలో అనిత స్పందించారు.

మాస్క్ అడిగినందుకు జగన్ ప్రభుత్వం ఆనాడు సుధాకర్‌ను ఎంతలా చిత్రహింసలకు గురిచేసిందో ప్రజలంతా చూశారని అనిత అన్నారు. ఆయనతో పాటు ఆ కుటుంబం పడిన మానసిక వేదనను ప్రత్యక్షంగా చూశానని గుర్తుచేశారు. జగన్ దురహంకారానికి బలైన సుధాకర్‌ను తిరిగి తీసుకురాలేమని.. ఆయన కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించడం దళితుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు బాధ్యత తీసుకుని సుధాకర్ కుటుంబానికి న్యాయం చేశారన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఉర్దూ వర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వ నోటీసుల నేపథ్యంలో నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

"ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి 100 ఎకరాలు తీసుకున్నారు. విద్యార్థులు పోరాడినా ఆందోళనను అణచివేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ ఇదే విధమైన భూదందా చేశారు. అక్కడ 400 ఎకరాలు తీసుకునేందుకు యత్నించారు. సుప్రీంకోర్టు సీజే సుమోటోగా తీసుకుని ఆదేశాలు ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు"అని కేటీఆర్ అన్నారు.

## నేనున్నా.. కష్టపడి బాగా చదువుకోండి..

మొదటి పేజీ తరువాయి

వీరి దీన పరిస్థితి తెలుసుకున్న కేసీఆర్ పిలిపించి మాట్లాడారు. ఆ విద్యార్థులు, తల్లులు గురువారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి రాగా చెక్కులను అందజేశారు. ఉన్నత చదువులకయ్యే ఖర్చంతా భరిస్తానని భరోసా ఇచ్చారు.

## ఐదో రోజూ నష్టాలే.. 25,700 దిగువకు నిఫ్టీ

మొదటి పేజీ తరువాయి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ప్రభావం చూపాయి. ముఖ్యంగా రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 25,700 దిగువకు చేరింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,200 పాయింట్లకు పైగా పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టు నేటి (శుక్రవారం) రాత్రి తీర్పు వెలువరించనుంది. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వస్తే మన మార్కెట్లకు ఊరట కలుగుతుంది. అనుకూలంగా తీర్పు వస్తే ఆయా దేశాలపై మరిన్ని టారిఫ్‌లు విధించేందుకు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఇది మార్కెట్లకు ప్రతికూల అంశం. ఈ నేపథ్యంలో ఈ వారాంతంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్ ఈ రోజు ఉదయం 84,022.09 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,180.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత మరింత అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇంట్రాడేలో 83,402.28 వద్ద కనిష్ఠాలను తాకిన సూచీ.. చివరకు 604.72 పాయింట్ల నష్టంతో 83,576.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 193.55 పాయింట్ల నష్టంతో 25,683.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ప్రధానంగా ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్, రిలయన్స్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.12 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,471 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఏరివేస్తా:

మొదటి పేజీ తరువాయి



పిఠాపురం: పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. "పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలి. ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరి శ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉంది" అని పవన్ అన్నారు.

## కర్నూలు బస్సు ప్రమాదం తరహాలో.. రాయచోటిలో మరో దుర్ఘటన

మొదటి పేజీ తరువాయి

సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఐరన్ లోడ్‌తో వెళుతున్న కంటైనర్ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఇటీవల కర్నూలులో జరిగిన బస్సు ప్రమాద ఘటన తరహాలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసులు.. స్వస్థలం రాయచోటి మండలం కంచరపల్లెగా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్న శ్రీనివాసులు దుర్మరణం కుటుంబీకులను విషాదంలోకి నెట్టింది. ప్రమాద ఘటనపై పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## జల వివాదాలు

### మనమే పరిష్కరించుకుందాం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు.

"పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది" అని సీఎం హామీ ఇచ్చారు.

ప్రపంచ నగరాలతో పోటీ..

" ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే" అని సీఎం అన్నారు.

# తారా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం - జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9 జనవరి**

"సంగారెడ్డి జిల్లా తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నాలుగు రోజుల పాటు నిర్వహించిన 25 గంటల తంజావూరు పెయింటింగ్ సర్టిఫికెట్ కోర్సులో చూపిన ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా ఆయన



మాట్లాడుతూ, ఇలాంటి కళా నైపుణ్య శిక్షణా కోర్సులు విద్యార్థుల్లో సృజనాత్మకత, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని తెలిపారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, సోలాపూర్‌కు చెందిన జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ, మల్లికార్జున హైస్కూల్, రాకంబాయి హత్తురే జూనియర్ కళాశాలల సహకారంతో ఈ కోర్సు నిర్వహించగా, రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ మల్లికార్జున బిరాజ్‌దార్ ప్రతిరోజూ ఆరు గంటల చొప్పున శిక్షణ అందించి విద్యార్థులకు తంజావూరు పెయింటింగ్‌కు సంబంధించిన మౌలిక నైపుణ్యాలను నేర్పినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఉపాధి కల్పించే వృత్తి నైపుణ్య కోర్సుల ద్వారా విద్యార్థులు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయగలరని పేర్కొంటూ, ఈ వర్క్‌షాప్ విజయవంతానికి సహకరించిన అధ్యాపక బృందం, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకురాలు డాక్టర్ అనురాధ తదితరులను ప్రత్యేకంగా అభినందించారు."

## మగ్దూమ్ మోహియుద్దీన్ ప్రెస్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9జనవరి**



సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో ఉర్దూ కవి, కమ్యూనిస్టు యోధుడు మగ్దూమ్ మోహియుద్దీన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రెస్ అసోసియేషన్ కార్యాలయాన్ని శుక్రవారం జర్నలిస్టులు ఘనంగా ప్రారంభించారు. ఆందోల్ నియోజకవర్గంలో పనిచేస్తున్న పట్టణ, గ్రామీణ జర్నలిస్టులు కలిసి ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించి మగ్దూమ్ మోహియుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణకు ఈ వేదిక ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎం) పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు, వివిధ జర్నలిస్టు యూనియన్ల ప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు."

## శిశు గృహం, సఖి కేంద్రం తనిఖీ చేసిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9జనవరి**

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీచంద్ర సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య శుక్రవారం సంగారెడ్డిలోని శిశు గృహం, సఖి కేంద్రాన్ని తనిఖీ




చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, శిశు గృహంలో ఉన్న పిల్లల భద్రత, బాగోగులపై ప్రత్యేక శ్రద్ధతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ క్రమశిక్షణ పాటించాలని, విద్యార్థులు మంచి విద్యతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షంచారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశిస్తూ, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు న్యాయ సంబంధిత అంశాల్లో ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారు సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు."

## మరవెల్లిలో ప్రజా దర్బార్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9జనవరి**

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో ప్రజా దర్బార్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షుల సమక్షంలో, పల్వట్ల సర్పంచ్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, వట్పల్లి ఎస్సై లవ కుమార్, ఎంపీడీవో తరుణ్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై లవ కుమార్ మాట్లాడుతూ



ప్రజలకు--పోలీసులకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేయడం అభినందనీయమని, ప్రజా దర్బార్ వంటి పత్రికల సహకారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మరవెల్లి టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ సంతోషం, వార్డు సభ్యులు సునీత, సామెల్, తమ్మలి మధు, మెతుకు శేఖర్, మన్య ఆంజనేయులు, మేదర సంజీవులు, మల్లేశం, సల్మాన్, జావేద్, పల్వట్ల గ్రామ సర్పంచ్ రాణి మహిపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ యాదప్ప, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు."

## సంగారెడ్డి సెంట్రల్ జైలులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య ఆకస్మిక తనిఖీ

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9 జనవరి**



"జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య కంది లోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైలు బెరక్కులు, ఖైదీల గదులు, వంటగది, బాత్రూంలు, నిల్వ గదులు తదితర విభాగాలను పరిశీలించి ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, భోజన నాణ్యత, ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించడంతో పాటు, సమయానికి బెయిల్స్, ములాఖత్ సదుపాయాలు అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించారు. ఖైదీల కేసుల పరిష్కారానికి లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను, భోజన నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించి, కూరగాయలు, బియ్యం తదితర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జైలు సూపరింటెండెంట్, జైలు సిబ్బంది పాల్గొన్నారు."

## ఎక్స్ఎంఎల్‌సీ రాములు నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 9**

సంగారెడ్డి జిల్లా మనూరు మండల్ బోరంచ గ్రామ నల్ల పోచమ్మ కమిటీ సభ్యులు ఈరోజు మాజీ శాసనమండలి సభ్యుడు రాములు నాయక్ గారి పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో బోరంచ శ్రీ నల్ల పోచమ్మ తల్లి



దేవస్థానం చైర్మన్ బెల్లంపురం మల్లయ్య, ఆలయ అర్చకులు సిద్ధయ్య స్వామి, ఆలయ సిబ్బంది శేఖర్, జీపీ నర్సింలు శుక్రవారం ఆయనను కలిసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో చైర్మన్ బెల్లంపురం మల్లయ్య మాట్లాడుతూ, 'రాములు నాయక్ గారికి ఆయురారోగ్యాలు మరియు ప్రజాసేవలో మరింత విజయాలు లభించాలని కోరుతున్నాం' అని తెలిపారు."

## మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు నాకే, 6వ వార్డ్ లో జెల్ల భాగయ్య బరిలో

**సందేశం టైమ్స్: సంగారెడ్డిజిల్లా ప్రతినిధి 9 జనవరి**

అందోల్--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి దామోదర్ రాజనర్సింహ గెలుపు కోసం కృషిచేసిన ప్రతి కార్యకర్తకు అవకాశం ఇవ్వాలని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.



6వ వార్డ్ జెల్ల భాగయ్య మాట్లాడుతూ, "మంత్రి దామోదర్ రాజనర్సింహ గెలుపు కోసం నేను కష్టపడ్డానని, అందరి ప్రోత్సాహం నాకే వస్తుందని విశ్వసిస్తున్నాను. నేను కూడా ముందుండి నా వంతు బాధ్యత తీసుకుని బరిలో దిగుతున్నాను," అని తెలిపారు. సీనియర్ నేతల ఆవేదన ప్రకారం, నామమాత్రంగా వచ్చి చేరిన వారికి స్థానం ఇవ్వకుండా, నిజంగా కృషిచేసిన కార్యకర్తలకే అవకాశం రావాలని కోరుతున్నారు.

## గజ్వేల్ ఎస్టి హాస్టలకు ప్రహరి గోడ లేక రోజు భయాందోళన

**- తక్షణమే ప్రహరి గోడ మంజూరు చేయాలని**
**- జిల్లా యంత్రాంగానికి మరోసారి డిబిఎఫ్ వినతి.**

**సిద్దిపేట జనవరి 9 సందేశం టైమ్స్:**

సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం లో ఎస్సీ,ఎస్టీ ల్యాండ్ మరియు అట్రాసిటీ కేసులపై జరిగిన సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ గజ్వేల్ లోని ఎస్టి హాస్టలకు ప్రహరీ గోడ వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి



వెంకటయ్య, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా యంత్రాంగానికి మరోసారి విన్నవించారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత ఎన్నో రోజులుగా మంత్రి జిల్లా ఇన్చార్జి వివేక్ వెంకటస్వామి , జిల్లా కలెక్టర్ హైమావతి గారికి డిబిఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ద్వారా వారి దృష్టికి తెచ్చిన ఫలితం లేదన్నారు, ఇప్పుడు మరోసారి రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమక్షంలో జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నామన్నారు, వెంటనే ప్రహరీ గోడ నిర్మాణం చెయ్యాలని విన్నవించారు. భవన నిర్మాణానికి 30 లక్షల నిధులు మంజూరు అయ్యాయని,ప్రహరి గొడ నిర్మాణానికి నిధుల కొసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని జిల్లా గిరిజ అధికారి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

## జనవరి 10న జరిగే ఉద్యమకారుల మహాసభలు జయప్రదం చేయండి -- తెలంగాణ ఉద్యమకారుల జెఎసి పిలుపు

**కూకట్‌పల్లి, జనవరి 09: సందేశం టైమ్స్:**

10 న జరిగే ఉద్యమకారుల సభను జయప్రదం చేయాలని కోరుతూ నేడు జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద సభ గోడ పత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఎంతోమంది ఉద్యమించగా ఏర్పడేదే స్వరాష్ట్రం ఉద్యమా పార్టీ అని చెప్పుకొని 10 ఏళ్లు పరిపాలించిన ఉద్యమకారులను విస్మరించింది నాటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఇకనైనా మేల్కొని ఉద్యమకారులకు తగు న్యాయం చేసి సంక్షమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సూర్యాపేటకు వేలాదిగా తరలి వచి సభలు జయప్రదం చేయాలని ఉద్యమ కారులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ప్రవీణ్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్,సీనియర్ జర్నలిస్ట్ ఎర్ర యాకయ్య, ఉద్యమకారులు వెంకటేశ్వర స్వామి ఆలయం ధర్మకర్త నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షలు గణేష్,జర్నలిస్ట్ నాయకులు డప్పు రామస్వామి, తోండా వెంకట్, రాములు,హరినాథ్ రావు,రజిత,రాజు,అంజి,కొమ్ము వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం

**- గొల్లపల్లి సర్పంచ్ కాశమైన మహేష్**

**జగదేవపూర్ జనవరి 9 సందేశం టైమ్స్:**


గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అందరం కలిసి కట్టుగా పనిచేసి గొల్లపల్లి గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి



చేద్దామని గొల్లపల్లి సర్పంచ్ కాశమైన మహేష్ అన్నారు. మండలం లోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో ఉన్న తాగునీటి, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు ఏ సమస్యలు ఉన్నా సమన్వయంతో పనిచేసి పంచాయతీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు.గ్రామాన్ని ఆదర్శంగా నిలిపే లా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్తగా నల్ల కలెక్షన్ తీసుకుంటే వారికి నూతన పాలకవర్గం ఉచిత నల్ల కలెక్షన్ ఇవ్వడం జరుగుతుంది అని తీర్మానం చేశారు. గ్రామం లో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద గ్రామ ప్రజలకు వాటర్ బాటిల్ కి 5 రూ. మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్ రాజు రెడ్డి,వార్డు సభ్యులు భాను ప్రకాష్, హసీనా బేగం, కరుణాకర్, రవీందర్, గొల్లపల్లి రవీందర్,శాంతమ్మ,దివాకర్ రెడ్డి, లావణ్య,భారతమ్మ,గ్రామ పంచాయతీ సిబ్బంది శేఖర్ రెడ్డి, కిష్టయ్య, సరిత, యాదయ్య,కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలు...

**మనోహరబాద్ జనవరి 9 సందేశం టైమ్స్:**



ముప్పిరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల యందు...
ముందస్తు సంక్రాంతి సంబరాలు లో భాగంగా సంక్రాంతి వంటకాలతో పుడ్ పెస్టివల్ ను ఏర్పాటుచేయడం జరిగింది...
ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కందల రాజనరసింహా మరియు ఉప సర్పంచి రామ్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది...ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాలకవర్గ సబ్యులు విద్యార్థులు చేసిన వంటలను చూసి వారిని అభినందించారు.అలాగే జనవరి 26 ఆటలపోటి కోసం ఆటస్థలం గురించి వారి దృష్టికి తీసుకెళ్లగా స్కూల్ పక్కనే ఉన్న కాలి స్థలం ఏర్పాటు చేస్తామని సర్పంచి హామీ ఇచ్చారని అన్నారు.వార్డు సభ్యులు సాదు సత్యనారాయణ. ఇతర వార్డు సభ్యులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# లీమ్కా బుక్ అఫ్ రికార్డ్ విజేత రఘురాంను అభినందించిన ప్రగతి స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ అంబాదాస్

– లీమ్కా బుక్ అఫ్ రికార్డ్ సాధించడం విద్య లోకానికే ఆదర్శం




గజ్వేల్ జనవరి 9 సందేశం టైమ్స్: చిన్న తనంలోనే కరాటే పోటీలో లీమ్కా బుక్ అఫ్ రికార్డ్ సాధించిన రఘురాంను శుక్రవారం నాడు ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ అంబాదాస్ లీమ్కా బుక్ అఫ్ రికార్డ్ ప్రశంశ పత్రాన్ని, బంగారు పతకాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రఘురాం సాధించిన విజయం మా ప్రగతి స్కూల్ కే గర్వకారణం అన్నారు. లీమ్కా బుక్ అఫ్ రికార్డ్ లో స్థానం సంపాదించడం అభినందనీయం అని అన్నారు. 30 నిమిషాల్లో 600 కిక్ కొట్టి ప్రపంచం రికార్డ్ ను రఘురరాం సొంతం చేసుకోవడం మా విద్యార్థి లోకానికే ఆదర్శం అన్నారు. ఈ అరుదైన ఘనత సాధించడం మాకు ఎంతో సంతోషం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహమాత్, నర్సింలు, లక్షణ్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విజేత తండ్రి శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు పాల్గొన్నారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలి



సందేశం టైమ్స్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఉన్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపుల వద్ద ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర వ్యవసాయ చేనేత మార్కెటింగ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల సిఏడి ఆహార పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల ప్రస్తుత స్థితి పంపుల పనితీరు కాలువల నిర్మాణం రైతులకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరించారు. ఈ ప్రాంత రైతులకు సాగునీరు త్వరగా అందించేందుకు పనులను మరింత వేగవంతం చేయాలని ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యంగా పూర్తి చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

# తల్వార్ తో దాడిచేసిన నిందితుడు కిరణ్ అరెస్టు

– సి ఐ ఆర్కపల్లి ఆంజనేయులు



కీసర,జనవరి9,సందేశం టైమ్స్: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో 08.01.2026 తేదీన తెల్లవారుజామున సుమారు 04:30 గంటలకు హత్యాయత్నం ఘటన చోటు చేసుకుంది. చినెంగాని కిరణ్ తండ్రి: నర్సింహ, వయసు: 27 సంవత్సరాలు, కులం: ఎస్సీ మాదిగ, నివాసం: హెచ్.నెం. 5-86, బంగారు మైసమ్మ ఆలయం సమీపంలోనీ నివాసి, కీసర టౌన్, గత నాలుగు సంవత్సరాలుగా కీసర చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో దోడ్ల డైరీ ఫ్రాంచైజీ నీ నిర్వహిస్తునాడు. అతను దోడ్ల డైరీ తెలంగాణ రాష్ట్ర హెడ్ అయిన శ్రీనివాస్ (వయసు సుమారు 50 సంవత్సరాలు, నివాసం: మౌలాలి, కార్యాలయం: రామంతాపూర్) పై దాడి చేశాడు. పెండింగ్ బకాయిల వసూలు,ఇతర విషయాలపై చర్చించేందుకు శ్రీనివాస్ కీసర ఎక్స్ రోడ్ వద్ద అంబేద్కర్ బొమ్మ దగ్గర ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం నిందితుడు తన వద్ద వున్న తల్వార్ తీసుకొని శ్రీనివాస్పై మెడ, ముఖంపై, శరీరంలోని ఇతర భాగాలపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాస్కు తీవ్ర గాయాలు కాగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే చికిత్స నిమిత్తం శ్రీకర హాస్పిటల్కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చడం జరుగుతోంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందనీ

## ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కీసర తెలియజేశారు.

– మల్కాజ్గిరి సెంట్ మేరీస్ గ్రామర్ హై స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు:



మల్కాజ్గిరి జనవరి 9 (సందేశం టైమ్స్: ).....

మల్కాజ్గిరి పివిఎన్ కాలనీలో గల సెయింట్ మేరీస్ గ్రామర్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. స్కూల్ ప్రిన్సిపాల్ జయరాం ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు వేసిన ముగ్గులను, వాళ్ళు వేసిన వేషధారణలు ప్రదర్శనలను తల్లిదండ్రులతో కలిసి స్కూల్ ప్రిన్సిపాల్ జయరాం సార్, ఉపాధ్యాయురాళ్లు తిలకించారు. తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు చదువుతోపాటు ఇలాంటి పండుగ సంబరాలు ప్రతి ఫెస్టివల్స్ సందర్భంలోనూ జరుగుతాయని ప్రిన్సిపల్ జయరాం సార్ తెలిపారు.

# సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



గజ్వేల్ జనవరి 9 సందేశం టైమ్స్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అహ్మదిపూర్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ , డాక్టర్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ల సహకారంతో మంజూరు అయిన చెక్కులను ఈరోజు గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ లబ్ధిదారులకు సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ తో కలిసి అందచేశారు. వారిలో చాడ కిష్టమ్మ 13500, కుంటా మాధవరెడ్డి 21000, కుంట్రంగల కవిత 33000,చాకలి పెంటకడి బాల్ రాజు 13500

పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదస్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ఆధ్వర్యంలో పేద ప్రజల హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి చెక్కులు అందజెయడం జరిగిందన్నారు. అధికారం ఉన్న లేకున్నా పేద ప్రజల కష్టసుఖాలను ఎల్లప్పుడూ ముందుంటామని ప్రభుత్వం నుంచి వచ్చే సీఎం సహాయ నిధి చెక్కులు కళ్యాణ లక్ష్మి చెక్కులు వంటి సంక్షమ కార్యక్రమాలను మేము స్పందించి బీఆర్ఎస్ పక్షన మేము ప్రజలకు వారధిలాగా పనిచేస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం పోల్చుకుంటే ఈ ప్రభుత్వం తక్కువ ఇవ్వడం జరుగుతుందని ఇప్పటికైనా ఆలోచించి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ తక్కువ ఇస్తునందున సీఎం సహా నిధి పెంచాలని కోరుతున్నాం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కుడా బలోపేతం చేయడం వలన పేద ప్రజలకు హాస్పిటల్ ఖర్చు తగ్గుతాయని తెలిపారు. ఏ ప్రభుత్వము వచ్చిన ప్రజలకు నమ్మకంగా ఉండాలని ఒక భరోసా కల్పించాలని నిరుపేదల కళ్ళల్లో సంతోషం చూసినప్పుడే ఆ ప్రభుత్వానికి విలువ ఉంటుందని తెలిపారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని రాష్ట్రంలో ప్రజలు అన్ని రంగాల్లో ఎన్నో అవస్థలు పడుతున్నారని అన్నారు. ముందుగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్,గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, మాజీ సర్పంచ్ ఆగయ్య, వార్డు మెంబర్స్ రజిత, మంజుల,ఎర్ర రాజు, స్రవంతి వెంకటేష్, క్యామీడ్రి రాములు, మహిపాల్ రెడ్డి, సిద్ధోల్లా రాములు, నాయకులు, కుంట కిష్టారెడ్డి, బ్యాగారి స్వామి, రాములు గౌడ్, ముత్యం గౌడ్, సకలి శ్రీనివాస్, మంద నరేష్,మంద యాదగిరి, బీమా రమేష్, జగన్ గౌడ్, కర్నాకర్, కనకయ్య, నర్సింహారెడ్డి, అదెపు శ్రీను, మధు, సంజీవ రెడ్డి, గురిమూర్తి, కర్నాకర్ రెడ్డి,భవాని లింగం, ఎల్లయ్య, శ్రీనివాస్, సాకలి కిష్టయ్య యాదయ్య,బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా కాంగ్రెస్ నేత మన్నేపల్లి సాంబశివరావు జన్మదిన వేడుకలు, నూతనపార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం..





శేరిలింగంపల్లి ,జనవరి 09: సందేశం టైమ్స్: మియాపూర్ డివిజన్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నే పల్లి సాంబశివరావు జన్మదిన వేడుకలు గురు వారం సాయంత్రం మియాపూర్ బాలాజీ నగర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత వారిని శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్, కూకట్ పల్లి నియోజక వర్గం ఇంచార్జీ బండి రమేష్, ఎంబిసి చైర్మెన్ జెరిపేటి జైపాల్ లుకలసి మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ బొల్లారం ఇ రోడ్డు బాలాజీ నగర్ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నేపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ , కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జీ బండి రమేష్ , ఎంబిసి చైర్మెన్ జెరిపేటి జైపాల్ లు మన్నే పల్లి సాంబశివరావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథులను మన్నెపల్లి సాంబశివరావు ప్రత్యేకంగా శాలువా లతో సత్కరించి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ,కావూరి ప్రసాద్, ఊరిటి వెంకటరావు, సునీత ప్రభాకర్ రెడ్డి,శశిధర్ పట్వారీ,నల్ల మల్ల రమేష్, కొడాలి రవి, సాంబశివ రావు,తాంద్ర రామచందర్ గౌడ్, కవిరాజ్, ,కృష్ణగౌడ్,రాజన్,లక్ష్మనారాయణ,రాజేంద్రప్రసాదు, అమర్,యలమంచి ఉదయ్ కిరణ్, సత్తి రెడ్డి , పద్మిని ప్రియదర్శిని,రవి గౌడ్, కామినేని శ్రీనివాస్, రమేష్,రెహమాన్,శివ, ప్రభాకర్ గౌడ్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రెసా మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




మహబూబాబాద్, జనవరి 9 సందేశం టైమ్స్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఎ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా యు. సునీల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎ. ఫెరోజ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా కె. చందా రాజేశ్వర్ రావు, జి. రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా జి. శ్రీనివాస్, బి. బాలకిషన్, జి. కృష్ణవేణి, ఎస్. గణేష్, కోశాధికారిగా టి. కృష్ణ ప్రసాద్ ను ఎన్నుకున్నారు.ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎం.ఎ. మాజిద్, జి. ప్రకాష్, జాయింట్ సెక్రటరీలుగా ఏ. పున్నంచందర్, టి. తరంగిణి, వి. మురళీకృష్ణ, ఏ. రవీంద్రనాథ్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా జి. సూరయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా సాయిసందీప్, ఎండి. ఇమాముద్దీన్, దుర్గాప్రసాద్, జి. కవిత, క్రాంతికిషోర్, ఎండి. సందాని లను ఎంపిక చేశారు. కలెక్టరేట్ అధ్యక్షులుగా టి. దామోదర్, కార్యదర్శిగా బి. నరేష్ రెడ్డి, మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షులుగా బషీర్, కార్యదర్శిగా రాంచందర్, తొర్రూర్ డివిజన్ అధ్యక్షులుగా శరత్ చంద్ర, కార్యదర్శిగా నజయీముద్దీన్ లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు సునీల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఫెరోజ్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పటిష్ఠత, ఉద్యోగుల సంక్షమం, హక్కుల సాధన కోసం ట్రెసా నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం ముందుండి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

## రైతు మేళాలో శ్రీరామ్ అగ్రో సర్వీసెస్ వారి స్వరాజ్ 969 ఎఫ్ఈ-70 హెచ్ పి 4 వీల్ క్రీపర్ గేర్ ట్రాక్టర్

పరిశీలించిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే జారె, తుమ్మల యుగంధర్



సందేశం టైమ్స్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 9 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన రైతు మేళా కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించారు. అలాగే దమ్మపేట మండలం మందలపల్లిలోని శ్రీరామ్ అగ్ర సర్వీసెస్ స్వరాజ్ ట్రాక్టర్ షోరూం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్ నందు ట్రాక్టర్ స్వరాజ్ 969 ఎఫ్ఈ-70 హెచ్ పి 4 వీల్ క్రీపర్ గేర్ ట్రాక్టర్ ను మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామాయిల్ రైతులకు మట్టలు మల్చింగ్ చేయడానికి స్వరాజ్ క్రీపర్ గేర్ ట్రాక్టర్ ఉపయోగపడుతుందని రైతులు సరికొత్త వ్యవసాయ పరికరాలు, ఆధునిక యంత్రాలతో టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలని దమ్మపేట మందలపల్లి శ్రీరామ్ అగ్రో సర్వీస్ స్వరాజ్ ట్రాక్టర్ షోరూమ్ వారు చేస్తున్న కృషి అభినందనీయం పేర్కొన్నారు. క్షత్రస్థాయిలో రైతుకు ఉపయోగపడే విధంగా ట్రాక్టర్లను తయారు చేయడం మంచి పరిణామమని తెలిపారు.రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు 50 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని యంత్రాల వల్ల సాగు ఖర్చులు తగ్గి, ఉత్పాదకత పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ షోరూం యజమాని రమేష్, కంపెనీ టి.యం కృష్ణ కాంత్, మహీంద్రా ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ నరేష్, షోరూం జిఎం కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ గోపాల కృష్ణ కంపెనీ ఎఫ్ఓ శ్రీకాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది : ఎమ్మెల్యే జారే



సందేశం టైమ్స్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో రైతులకు ఉపయోగపడే అనేక కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ చేనేత మార్కెటింగ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల సిఏడి ఆహార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో సిసి రోడ్ల నిర్మాణానికి బాలికల కోసం హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకం జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌ను అధికారికంగా ప్రారంభించారు. భూసార పరీక్షలు మొక్కల విశ్లేషణకు ఉపయోగపడే ఆధునిక ప్రయోగశాలను ప్రారంభించి సహజ వ్యవసాయంపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుకునే విధానాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి సూచనలను నేరుగా విని రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్పష్టత కల్పిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం (రైతు మేళ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ బి రాహుల్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా స్థాయి ఉన్నత అధికారులు, ఆయా శాఖల అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.